క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్నదానం



కలెక్టరేట్ వద్ద అర్జీదారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు వచ్చే అర్జీదారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదానం 20వ సోమవారం కూడా కొనసాగింది. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గత 19 వారాలుగా అర్జీదారులకు అన్నదానం జరుగుతున్న విషయం విదితమే. రామాపురం మండల స్టోన్‌క్రషర్స్ యాజమాన్యం ఆర్థిక సౌజన్యంతో సోమవారం కలెక్టరేట్ వద్ద అన్నదానం జరిగింది.

సిద్దవటంలో వేసవి విజ్ఞాన కార్యక్రమం



విద్యార్థులచే ధ్యానం చేయిస్తున్న పార్వతి

సిద్దవటం : సిద్దవటం గ్రంథాలయంలో వేసవి విజ్ఞానం కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులచేత నీతి కథలు, పద్యాలను చెప్పించామని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. సోమవారం 30 మంది విద్యార్థులు వేసవి శిబిరానికి హాజరయ్యారన్నారు. విద్యార్థుల చేత పార్వతి ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

సిద్దవటం : భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కల్యాణ మండపంలో సోమవారం కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం ప్రారంభించిన అడిషనల్ కమాండెంట్ కె.ప్రభుకుమార్ పరిసర గ్రామాల ప్రజలు 83 మందికి కంటి, చెవి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామన్నారు. నేత్రవైద్యురాలు శ్రావణి రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి, పుష్పగిరి కంటి ఆసుపత్రి కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు ఎస్‌ఐగా చెన్నకేశవులు



నందలూరు(రాజంపేట): నందలూరు ఎస్‌ఐగా చెన్నకేశవులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సబ్‌డివిజన్ పరిధిలో రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట స్టేషన్‌లలో గతంలో పనిచేశారు. గత కొద్దినెలలుగా నందలూరు ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఈ స్థానాన్ని చెన్నకేశవులుకు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజలకు శాఖాపరంగా మెరుగైన సేవలందిస్తామన్నారు. కాగా హెచ్‌ఆర్‌పీసీఐ జిల్లా చైర్మన్ డేవిడ్, మైనార్టీ చైర్మన్ జుల్ఫీకర్‌లు ఎస్‌ఐను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు ఏపీజీబీ మేనేజర్‌గా మాధవరెడ్డి



పెనగలూరు: పెనగలూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా ఎస్.మాధవరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు గోపవరం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు బదిలీ అయ్యారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న క్యాషియర్ సురేష్ ఒంగోలుకు బదిలీకాగా, చిట్వేలి ఏపీజీబీ నుంచి జోసఫ్ పెనగలూరుకు బదిలీ అయ్యారు.

లోక్ అదాలత్‌లో 398 కేసులు పరిష్కారం

రాజంపేట : రాజంపేట జాతీయ లోక్‌అదాలత్‌లో 398 కేసులు పరిష్కరించినట్లు రాజంపేట కోర్టు ఇన్‌చార్జి జడ్జి లత ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ కేసుల్లో రూ.4లక్షలు, క్రిమినల్ కేసుల్లో రూ.29.400, మెయింటెనెన్స్ కేసుల్లో రూ.27 లక్షల 50 వేలు, ఎన్‌ఐ యాక్ట్ కేసుల్లో రూ.3 లక్షల 90 వేలు పిర్యాదుదారులకు ఇప్పించామన్నారు. క్రిమినల్ కేసులలో రూ.2,84,200 ప్రభుత్వానికి జమ చేశామన్నారు. మొత్తం రూ.38, 53, 600 పరిష్కరించామన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ఏపీపీ, సీఐ, ఎస్‌ఐ, న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు
- వడ్డిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు: సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, స్థానిక సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కోడూరు 4 సచివాలయం పరిధిలోని వడ్డిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాదరణ పొందుతోందన్నారు. సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా ప్రజలందరికీ తోడు నీడగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ బాసటగా నిలవాలని కోరారు. గతంలో ఏదైనా ఒక పథకం ద్వారా లబ్ధి పొందాలంటే కాళ్లరిగేలా కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులకు పూర్తి భిన్నంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు. రాష్ట్రంలో ఎలాంటి వివక్ష, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శవంతమైనదన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా, అర్హత ఉండి ఏ సంక్షేమ పథకం అందకపోయినా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమసవర్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ సంఘం కార్మికులు

రాయచోటి అర్బన్ : నిధులు లేక నిర్వీర్యమైపోతున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం వెంటనే పరిరక్షించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు గాలి చంద్ర, సలీంబాషా డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. బోర్డు ద్వారా 22 లక్షల మంది కార్మికులు సంక్షేమ ఫలాలను అనుభవిస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో బోర్డులో నిధులలేమి కారణంగా సంక్షేమ ఫలాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట సమితి సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పుల్లంపేట : మండల పరిధిలోని గారాలమడుగు దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రూ. 1 లక్ష విరాళం అందించారు. దీంతో స్థానికులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

అన్నదానం పుణ్యకార్యం



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న దాతలు

చిట్వేలి: ఆకలితో ఉన్న వారి కడుపు నింపడం మహా పుణ్యకార్యమని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చిట్వేలి శాఖ అధ్యక్షుడు కంబగిరి మునిరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ మాజీ అధ్యక్షుడు ఈపూరి పెంచలయ్య 3వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సోదరుడు లక్ష్మీపతి, కుమారులు కళ్యాణ్, సాయిలు యాచకులు, అనాథలు, పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లి: అంబేడ్కర్ భవనానికి స్థలాన్ని కేటాయించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి తహసీల్దార్ పీర్ మున్నిని కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ భవన్ నిర్మిస్తామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారని చెప్పారు. అందులో భాగంగా స్థలాన్ని కేయించాలని కోరారు. అలాగే గాదెల పంచాయతీలో దళితులకు కేటాయించిన భూములను ఆన్‌లైన్ చేయాలన్నారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గాప్రసాద్, నరసింహ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరు శంకర్‌రెడ్డి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రేఖ తెలిపారు. ఐదో తరగతి తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో పూర్తి చేసుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. జూన్ 11వ తేదీ ఏపీ మోడల్ స్కూల్‌లో రాత పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

26 నుంచి సీమ స్థాయి శిక్షణ తరగతులు



రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

రాయచోటి అర్బన్: ఈనెల 26, 27, 28 తేదీలలో రాయలసీమ స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులను కడపలో నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లవకుమార్, కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం రాయచోటి సీపీఐ కార్యాలయంలో వారు శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో విద్యార్థులకు సైద్ధాంతిక, శాస్త్రీయ విజ్ఞానం కొరవడుతోందన్నారు. పాలకపక్షాలే విద్యార్థులలో అశాస్త్రీయ భావజాలాన్ని నింపుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, నాయకులు నారాయణ, సతీష్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

18న ఊటీకి సమ్మర్ స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ : వేసవి సెలవులను పురస్కరించుకుని మదనపల్లె 2 డిపో నుంచి ఈనెల 18న ఊటీకి ప్రత్యేక స్పెషల్ బస్సు నడపనున్నట్లు డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 18న రాత్రి 8 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 19న ఉదయం ఊటీకి చేరుకుంటుందన్నారు. 20న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి కూనూరు, మెట్టుపాలెం మీదుగా కోయంబత్తూరు ఈశా టెంపుల్ చూసుకుని అదే రోజు రాత్రి బయలుదేరి 21న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. చార్జీ రూ.2250 చెల్లించాలన్నారు.

20న వేలాంగిణికి ప్రత్యేక బస్సు

వేసవి పురస్కరించుకుని వేలాంగిణికి 20న ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డీఎం తెలిపారు. 20న రాత్రి మదనపల్లెలో బయలుదేరి 21న తెల్లవారుజామున వేలాంగిణికి చేరుతుందన్నారు. తిరిగి అదే రోజు రాత్రి బయలుదేరి 22న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. చార్జీ రూ.1950 చెల్లించాలన్నారు. వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

పుట్‌పాత్ ఆక్రమణలకు అడ్డుకట్టేది!



రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం



ఫుట్‌పాత్, డ్రైనేజీ కాలువలను ఆక్రమిస్తున్న గృహ యజమానులు

గాలివీడు : మండల కేంద్రమైన గాలివీడులో పుట్‌పాత్ ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గాలివీడు టౌన్ పరిధిలో గేటు నుంచి బస్టాండు వరకు రూ.7కోట్లతో నూతనంగా నాలుగు వరుసల రహదారిని నిర్మించారు. రోడ్డుకిరువైపులా డ్రైనేజీపై పుట్‌పాత్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే పుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణాలు, రోడ్డుపై అడ్డుగా వాహనాల పార్కింగ్, పుట్‌పాత్‌పై దుకాణ సామగ్రి ఉండటం వంటి చర్యలతో రహదారి విస్తీర్ణం పూర్తిగా కుంచించుకుపోయింది. దీంతో ట్రాఫిక్ సమస్య అధికమై వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలోనే పుట్ పాత్ ఆక్రమణలు, ట్రాఫిక్ సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలని పలువురు ఫిబ్రవరి మాసంలో స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పది రోజుల క్రితం స్వయంగా తహసీల్దార్ దైవాదీనం, ఎంపీడీఓ శేఖర్‌నాయక్, ఎస్‌ఐ వెంకటశివకుమార్ తమ సిబ్బందితో కలిసి ప్రధాన రహదారిని పరిశీలించి ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



ఆటల ద్వారా దిక్కులను కనుగొనే పద్ధతిని తెల్పుతున్న ఉపాధ్యాయుడు శంకరయ్య

రాయచోటి అర్బన్ : జనవిజ్ఞాన వేదిక సభ్యులు పిల్లల్లో చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుండడం అభినందనీయమని డైట్ అధ్యాపకురాలు శ్రీదేవి అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తుందన్నారు. కృత్యాధార బోధనపై ఆమె పిల్లలకు అవగాహన కల్పించారు. ఒరిగామి నిపుణుడు రాజశేఖర్ పిల్లలకు కాగితంతో వివిధ రకాల బొమ్మల తయారీని నేర్పించారు. పిల్లల్లో సెల్‌ఫోన్ వ్యసనాన్ని దూరం చేసి విద్యార్థులలో ఏకాగ్రతను పెంచేందుకు ఒరిగామి కళ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు శంకరయ్య ఆటల ద్వారా ఒక ప్రాంత దిక్కులను కనుగొనే పద్ధతిని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి రామయ్య, నాయకులు రవీంద్రనాథరెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఆంజనేయులు, రవి, శివారెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం



అభయాంజనేయస్వామి గ్రామోత్సవంలో భక్తులు

పుల్లంపేట: మండల పరిధిలోని పెరియవరం కోట గడ్డపై వెలసిన అభయాంజనేయస్వామికి పూజారి శివశర్మ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య అనంతంపల్లి, అప్పారాజుపేట, రామక్కపల్లి, జానకీపురం, అగ్రహారం గ్రామాల్లో అంగరంగ వైభవంగా స్వామివారి గ్రామోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పదో తరగతి విద్యార్థులకు నగదు అందజేత



విద్యార్థులకు నగదు అందజేస్తున్న దృశ్యం

పుల్లంపేట : పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు సోమవారం పుల్లంపేట వైస్ ఎంపీపీ బోగా వెంకటసుబ్బమ్మ కుమారుడు పార్థసారథి ఆధ్వర్యంలో నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే విజయం సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, ప్రధానోపాధ్యాయుడు మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి

లక్కిరెడ్డిపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటీపీ షేర్ చేయడం లాంటి వాటిపట్ల అప్రమత్తత అవసరం అన్నారు. వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రోడ్డుప్రమాదాల నుంచి బయటపడవచ్చన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ నేపథ్యంలో ఏవైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాలలో చిన్నచిన్న విషయాలకు గొడవలకు దిగకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పేకాట, బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జీవీ పుట్ బాల్ పేరుతో కొంతమంది సైబర్ క్రైమ్‌కు పాల్పడుతున్నారని ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్టు అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీరబల్లిలో

వీరబల్లి(రాజంపేట) : జీవీపుట్‌బాల్ ఆన్‌లైన్ యాప్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రహీముల్లా ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త నంబర్ల నుంచి ఎవరైనా ఫోన్ చేసి మీకు రెట్టింపు డబ్బు వస్తుందని ఆశ చూపిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ వాహనాలను పిల్లలకు ఇచ్చి పంపరాదన్నారు. వాహనాదారులు తప్పనిసరిగా లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు.

అనుమతులు లేని యాప్‌లపై జాగ్రత్త

సంబేపల్లె : అనుమతులు లేని యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ షరీఫ్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి యాప్‌లనైనా గూగుల్ ప్లే స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రత్యేకంగా జీవీ ఫుట్‌బాల్ యాప్‌తో ప్రజలు మోసపోవద్దని తెలిపారు. అనుమతులు లేని యాప్‌లు, నగదు సంబంధిత యాప్‌లను లింక్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకుంటే ఆన్‌లైన్ మోసాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. మోసపోయిన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



వెంకటరామాంజులరెడ్డి, వ్యవసాయాధికారి

సంబేపల్లె : మండలంలోని ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు సంబంధించి పచ్చరొట్ట ఎరువుల విత్తనాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటరామాంజులరెడ్డి తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు జీలుగ 58.5 క్వింటాళ్లు, పిల్లిపెసర 20.96 క్వింటాళ్లు మండలానికి మంజూరయ్యాయన్నారు. జీలుగ 10 కేజీల సంచి రూ. 790 ఉండగా సబ్సిడీ పోను రూ.395 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పిల్లిపెసర 8 కేజీల సంచి రూ. 776 కాగా సబ్సిడీ పోను రూ. 338 చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలి

వైఎస్‌ఆర్ రైతు భరోసా, పీఎం కిసాన్ యోజనకు సంబంధించి అర్హత ఉండి లబ్ధి పొందని వారు ఈ నెల 18 వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

వైభవంగా గర్నిమిట్ట ఎల్లమ్మ జాతర



పూజలందుకుంటున్న ఎల్లమ్మ

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన ఎల్లమ్మతల్లి జాతర వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా మూడు రోజులుగా అమ్మవారి ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మ వారికి మొక్కులు చెల్లించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళా భక్తులు బోనాలు తీసుకువచ్చారు. అమ్మవారికి బోనాలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలం నుంచే గాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చాందినీబండ్లు కట్టి మొక్కుబడులు చెల్లించారు. చాందినీ బండ్లు ముందు బళ్లారి డ్రమ్స్, చక్క భజనలు, కోలాటాలు, పిల్లనగ్రోవి తదితర కళారూపాలు ఆకట్టుకున్నాయి. సోమవారం ఉదయం చాందినీబండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్లకు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. జాతరలో భాగంగా అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఎల్లమ్మ అమ్మవారిని దర్శించి తరించారు. ఆలయం ముందు పెద్ద ఎత్తును కొబ్బరి కాయలు కొట్టి సంవృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు అభివృద్ధి చెందేలా ప్రజలను చల్లగా చూడాలని వేడుకొన్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.

ఘనంగా చౌడేశ్వరిదేవి ఉత్సవాలు

కలకడ : మండలం కేంద్రంలో చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఘనంగా నిర్వహించారు. దేశాయి కుటుంబ సభ్యులు అమ్మవారికి ఒడిబియ్యం కట్టి ఉత్సవాలను ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం తర్వాత అమ్మవారిని చాందినీబండిలోని సింహవాహనంపై ఊరేగించారు. అమ్మవారి రథం ఎదుట విశాఖపట్నం వారి కోలాటం నృత్యాలు, ప్రొద్దుటూరి వారి జ్యోతుల నృత్యాలు భక్తులను ఆకట్టుకన్నాయి. అమ్మవారి సేవలో తొగటవీర క్షత్రియ సంఘం రాష్ట అధ్యక్షులు మొడెం వీరాంజనేయప్రసాద్, మహిళ అధ్యక్షురాలు సురువు శ్రీలత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి విజయ్‌భాస్కర్, ఎంపీపీ శ్రీదేవి రవికుమార్, సింగిల్ విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ విశ్వనాథ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కమనీయం.. లక్ష్మీనృసింహుని కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత నృసింహ స్వామి



కల్యాణంలో మొక్కులు చెల్లించుకుంటున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీనృసింహ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆర్య వైశ్య సంఘం గౌరవ సలహాదారుడు సనిశెట్టి రమేష్ బాబు ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో ముందుగా దేవదేవేరిలకు ఎదుర్కోలు కార్యక్రమం జరిగింది. అనంతరం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీ నృసింహ స్వామి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వినోద్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణలతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని పూజలు చేసి కల్యాణం తిలకించారు. జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సనిశెట్టి నవీన్‌కుమార్, ఆర్యవైశ్యులు అన్నపూర్ణ మురళీ, అవినాష్, నరసింహా, రాజేష్, శ్రీను, రామకృష్ణ, దాము, నాగేంద్ర, రజని, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.రమేష్‌నాయుడు, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.